క్లుప్తంగా

రాస్నంలో కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

యాలాల: మండల పరిధిలోని రాస్నం గ్రామంలో ఎల్ఎస్ఆర్ యువసేన ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. స్థానిక రైతు వేదికలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరానికి పొరుగు గ్రామాల ప్రజలు సైతం విచ్చేసి కంటి పరీక్షలు చేయించుకున్నారు. వంద మందికి పైగా పరీక్షలు నిర్వహించిన సిబ్బంది అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మొగులయ్య, మల్లారెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు మన్నాన్, సాయన్న, హన్మయ్య, సత్తయ్య, ఖాజా పాష, సిద్దేశ్వర్ తదితరులు ఉన్నారు.

పోచమ్మతల్లి ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న రాజప్ప

కుల్కచర్ల: ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు అండగా ఉంటామని బీఆర్ఎస్ నాయకుడు రాజప్ప అన్నారు. మందిపల్‌లో నిర్మిస్తున్న పోచమ్మతల్లి ఆలయ నిర్మాణానికి సోమవారం ఆయన రూ.10వేలు విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆలయాల నిర్మాణాలకు గ్రామస్తులు ముందుకురావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆనంద్, ప్రసన్న, మొగులయ్య, వెంకటయ్య, ప్రసాద్, మహేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పరిరక్షణ అందరి బాధ్యత



మొక్క నాటి నీరు పోస్తున్న అధికారులు, నాయకులు

దౌల్తాబాద్: మొక్కలు నాటి పరిరక్షించడం బాధ్యతగా తీసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో సోమవారం వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. మొక్కలు మానవ మనుగడకు ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు వెంకట్‌రెడ్డి, వీరన్న, ఎంపీటీసీ మాజీ సభ్యుడు దస్తప్ప, ఏపీఓ అంజిలయ్య, టీఏ కృష్ణహరి, పంచాయతీ కార్యదర్శి గోపాల్ తదితరులున్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు మేలు

కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు రవి నాయక్



చెక్కు అందజేస్తున్న రవి నాయక్

దుద్యాల్: ముఖ్యమంత్రి సహాయనిధి పథకంతో పేదలకు మేలు చేకూరుతుందని కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు రవినాయక్ అన్నారు. మండల పరిధిలోని సాగారం తండాకు చెందిన నరేశ్ రాథోడ్‌కు సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.50 వేలు మంజూరయ్యాయి. ఈ చెక్కును సోమవారం బాధితులకు రవినాయక్ అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు గోపాల్ నాయక్, లాలు నాయక్, సోమనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



అంగడిచిట్టపల్లిలో ఇందిరమ్మ ఇంటికి మార్కింగ్ ఇస్తున్న అధికారులు

పూడూరు: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను అందజేస్తామని పీఏసీఎస్ చైర్మన్ సతీశ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని అంగడిచిట్టంపల్లి, నిజాంపేట్‌మేడిపల్లి, పోతిరెడ్డిపల్లి, పూడూరు, చీలాపూర్, ఎన్కేపల్లి తదితర గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు మార్కింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇంటి ప్రొసీడింగ్స్ తీసుకున్న వారు వెంటనే పనులను ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగయ్య, నాయకులు రవి, రాములు, తదితరులు పాల్గొన్నారు.

పశుపోషకులకు 'షాక్'

- విద్యుత్ ప్రమాదాల కారణంగా మూగజీవాల మృత్యువాత
- అవగాహన లేక.. పరిహారం అందక
- నష్టపోతున్న రైతులు

దుద్యాల్: విద్యుదాఘాతానికి మూగజీవాలు బలవుతున్నాయి. రూ.లక్షల విలువ చేసే కాడెద్లు, పాడి పశువులు మృత్యువాత పడుతున్నాయి. ఈదురుగాలులు, వర్షాలకు తెగిపడిన విద్యుత్ తీగల కారణంగా పలువురు రైతులు మృతి చెందగా మరికొందరు క్షతగాత్రులవుతున్నారు. బాధిత కుటుంబాలకు విద్యుత్‌శాఖ పరిహారం ఇచ్చి ఆదుకుంటున్నా మెజార్టీ ప్రజలకు అవగాహన లేక నష్టపోతున్నారు. అధికారులు ప్రజలకు అవగాహన కల్పించడంలోనూ నిర్లక్ష్యం వహిస్తున్నారనే అపవాదులు లేకపోలేదు. ఇప్పటికైనా అధికారులు గ్రామాల్లో విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

మచ్చుకు కొన్ని..

- మండల పరిధిలోని పోలేపల్లి తండాకు చెందిన రాథోడ్ చందు నాయక్ పాడి గేదె ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతంతో మృత్యువాత పడింది. దీంతో రైతు రూ.70 వేలు నష్టపోయాడు.
- పల్లెగడ్డకు చెందిన ముకుందరెడ్డికి చెందిన కాడెద్దు మృతి చెంది రూ.60 వేల నష్టం వాటిల్లింది.
- కొడగంల్ మండలం పలుగురాళ్ల తండాకు చెందిన మునేగారి సాయిలుకు చెందిన కాడెద్దు మృతి చెందడంతో రూ.50వేలు నష్టం చవిచూశాడు.
- రోటిబండ తండాకు చెందిన పాండు నాయక్(61) పశువులకు మేత కోస్తూ విద్యుదాఘాతంతో విగతజీవిగా మారాడు.



పలుగురాళ్ల తండాలో మృతి చెందిన ఎద్దు(ఫైల్)

బాధితుల ఖాతాలో పరిహారం

విద్యుత్ ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలి. కేసు నమోదు తర్వాత పశువైద్యుల సాయంతో పంచనామా చేయించాలి. పరిహారం పొందేందుకు కేసుకు సంబంధించిన పత్రాలతో విద్యుత్ శాఖ సహాయక ఇంజనీర్ దగ్గర దరఖాస్తు చేసుకోవాలి. మరణ ధ్రువపత్రం, ఎఫ్ఐఆర్, పంచనామా నివేదిక, ఆధార్ కార్డు, బ్యాంకు పుస్తకం తదితర జిరాక్స్ కాపీలను జతచేసి విద్యుత్ ఏఈకి అందజేయాలి. ఏఈ నుంచి పత్రాలు ఏడీఈకి చేరుతాయి. ఆ పత్రాలు ఉన్నతాధికారులకు అందిన తర్వాత బాధితుల బ్యాంకులో పరిహారం జమచేస్తారు.

దరఖాస్తు ఇలా

- అంగవైకల్యం పొందితే ప్రమాద విషయం వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి. బిల్లులు, ఇతర ఖర్చులకు సంబంధించిన నకలు జత చేసి విద్యుత్‌శాఖ ఏఈకి దరఖాస్తు సమర్పించాలి. ఉన్నాధికారుల పరిశీలన అనంతరం పరిహారం జమచేస్తారు.
- పశువులు మృత్యువాత పడితే విద్యుత్‌శాఖ అధికారులకు, పంచాయతీ కార్యదర్శికి సమాచారం ఇవ్వాలి. పశువైద్యాధికారి నుంచి పశువు ఖరీదు తెలిపే పత్రం, మృతి చెందినట్లు ధృవీకరణ పత్రం తీసుకోవాలి. మృతి చెందిన పశువు నిమిత్తం పరిహారం బాధితుడికి అందిస్తారు.

అర్హులకే పరిహారం



విద్యుత్ ప్రమాదాలకు సంబంధించిన బాధిత కుటుంబాలు అర్హులైతే పరిహారం తప్పకుండా అందుతుంది. ప్రమాద స్థాయిని బట్టి పరిహారం అందుతుంది. మూగ జీవాల విషయంలో పశువైద్యాధికారి ఇచ్చే ధ్రువీకరణ పత్రాలు పరిగణలోకి తీసుకుంటున్నాం. విద్యుత్ సిబ్బందితో ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం

– ఆనంద్, విద్యుత్ ఏఈ, దుద్యాల్

ప్రమాదం నిర్ధారణైతేనే..



మూగ జీవాలకు విద్యుత్ ప్రమాదం సంభవించినట్లైతే వెంటనే పశువైద్యులకు తెలియజేయాలి. ప్రమాదం జరిగిన పశువుకు నిర్ధారణ పరీక్షలు చేస్తాం. విద్యుత్ షాక్‌తోనే ప్రమాదం జరిగిందని నిజ నిర్ధారణ తర్వాత పశువుకు సంబంధించి మరణ ధృవ పత్రం, పరీక్షకు సంబంధించిన ప్రతాలు పశు యాజమానికి అందజేస్తాం.

– పరమేశ్వర్, పశువైద్యాధికారి, కొడంగల్

పంచాయతీలపై నజర్

- అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు
- పారిశుద్ధ్య కార్మికుల వేతనాల విడుదల
- ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంకన్‌గౌడ్

SAKSHI INTERVIEW

బొంరాస్‌పేట: గ్రామ పంచాయతీల అభివృద్ధి పనులు, ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించామని ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంకన్‌గౌడ్ అన్నారు. తాజాగా మంజూరైన నిధులు, మండల పరిషత్, గ్రామ పంచాయతీల నిర్వహణ కార్యక్రమాల గురించి ఆయన వివరించారు. మండలంలో ఇటీవల కొత్తగా ఏర్పాటైన రెండు గిరిజన పంచాయతీలతో కలిపి మొత్తం 35 పంచాయతీలుండగా 32 మంది కార్యదర్శులున్నారు. మండలంలో కొనసాగుతున్న పంచాయతీరాజ్ శాఖ పనుల గురించి సోమవారం ఆయన 'సాక్షి'కి వివరించారు.

మంజూరైన నిధులు

ప్రతీ గ్రామ పంచాయతీలో కమ్యూనిటీ సోక్‌పిట్స్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. వరద నీరు వెళ్లే ప్రధాన కాల్వ చివరి భాగంలో ఇంకుడు గుంతలు నిర్మాణం, 322 ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మరుగుదొడ్ల నిర్మాణానికి ఇందిరమ్మ ఈజీఎస్ నిధుల్లోనే ప్రత్యేకంగా రూ.12వేల చొప్పున మంజూరయ్యాయన్నారు. మండల కేంద్రంలో వారాంతపు సంత జరిగే ప్రాంతంలో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణం కోసం రూ.3లక్షలు మంజూరయ్యాయని, స్థల సేకరణకు రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుంటున్నామని చెప్పారు. కట్టుకాల్వతండా, పాలబాయి తండాలో తడిచెత్త, పొడి చెత్త నిల్వ కోసం రూ.2లక్షలతో షెడ్లు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని చెప్పారు.



ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంకన్‌గౌడ్

పారిశుద్ధ్యంపై స్పెషల్ ఫోకస్

శానిటేషన్ క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం, మురుగు నిల్వ లేకుండా, దోమల నివారణకు చర్యలు, వాటర్‌ట్యాంకుల పరిసరాలను శుభ్రం చేయడం, పిచ్చిమొక్కల తొలగింపు, పాఠశాలలు, అంగన్‌వాడీల పరిసరాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

అభివృద్ధి పనులు

ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో మండలంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. అంగన్‌వాడీ భవనాలు, గ్రామపంచాయతీ భవనాల నిర్మాణం, బీటీ, సీసీ రోడ్ల పనులు వేగం పుంజుకున్నాయి. ఎంపీడబ్ల్యూ పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్మికులున్నారని, ఒక్కో కార్మికుడికి రూ.9,500 చొప్పున వేతనం అందుతుందని తాజాగా ఏప్రిల్, మే, జూన్ వేతనాల చెక్కులు అందించామన్నారు.

వనమహోత్సవానికి సిద్ధం

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించేందుకు ప్రణాళిక ప్రకారం అన్ని ఏర్పాట్లు చేసుకున్నాం. మరో వారం రోజుల్లో యుద్ధ ప్రాతిపదికన చేపట్టనున్నాం. ప్రత్యేకంగా బీఐపీ ప్లాంటేషన్ చేపట్టనున్నామని చెప్పారు.

నీటి సమస్య పరిష్కారానికి రూ.18 లక్షలు

మోమిన్‌పేట: గ్రామంలో తాగునీటి అవసరాలకు ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి రూ.18లక్షలు మంజూరు చేసినట్లు కాంగ్రెస్ నాయకుడు సిరాజుద్దీన్ తెలిపారు. సమస్యలున్న కాలనీలో బోరుబావులు తవ్విస్తున్నామన్నారు. మొత్తం తొమ్మిది బోరు బావులు మంజూరు చేస్తే ఏడు బోర్లు వేయించామన్నారు. శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రత్యేకచొరవ తీసుకుని నిధులు మంజూరు చేయడంతో తాగునీటి సమస్యకు పరిష్కారం లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి స్వప్న, కాంగ్రెస్ నాయకులు ఎజాస్ పటేల్, రవి, హాజి, తాజుద్దీన్, మోసిన్, ముజ్జు తదితరులు ఉన్నారు.



నూతన బస్టాండు కాలనీలో బోరు వేయించే పనులను ప్రారంభిస్తున్న నాయకులు

నెమ్మదించిన ఇళ్ల నిర్మాణం

- 399 మందికిగాను 99 మంది లబ్ధిదారులే పనులు ప్రారంభం
- నిబంధనలు పాటించని వారికి బిల్లు నిలిపివేత

మోమిన్‌పేట: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు నత్తనడకన కొనసాగుతున్నాయి. ముందస్తుగా పునాదులు తీయడం, బేస్‌మెంట్ నిర్మాణం కొరకు డబ్బులు పెట్టుబడులు పెట్టడానికి ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని 28 గ్రామ పంచాయతీల్లో 399 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి అనుమతి పత్రాలు అందజేశారు. ఇప్పటికి 99 మంది లబ్ధిదారులు పునాదులు తీశారు. ఇంకా 300మంది లబ్ధిదారులు పనులు ప్రారంభించలేదు. ఉన్నాతాధికారులు పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇస్తున్నారు. మండల పరిధిలోని బాల్‌రెడ్డి గూడెంలో పైలెట్ ప్రాజెక్టు కింద 36 మంది లబ్దిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఇందుకులో ఏడుగురు పనులు ప్రారంభించగా ఒక్కరికే బేస్‌మెంట్ బిల్లు రూ.1లక్ష అందజేశారు. మిగిలిన వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎక్కువ విస్తీర్ణంలో ఇళ్లు నిర్మాణం చేపట్టడంతో బిల్లులు ఇవ్వడం సాధ్యమవదని హౌసింగ్ అధికారులు పేర్కొంటున్నారు. ప్రొసీడింగ్స్ తీసుకున్న వారంతా పనులు ప్రారంభించేలా కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ విజయలక్ష్మి పేర్కొంటున్నారు. ప్రతీవారం సమీక్ష సమావేశంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిపై కార్యదర్శులకు దిశా నిర్దేశం చేస్తున్నామన్నారు.

చర్యలు తీసుకోవాలి

అనంతగిరి: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, సబ్బండవర్గాల అభ్యున్నతికి పోరాడుతున్న తీన్మార్ మల్లన్నపై, అతని కార్యాలయం ధ్వంసం చేసిన ఘటనకు కారణమైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని తీన్మార్ మల్లన్న టీం జిల్లా అధ్యక్షుడు ఘనపురం శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు సోమవారం వికారాబాద్‌లో ఎన్టీఆర్ చౌరస్తాలో ఎమ్మెల్సీ కవిత దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేమన్న, జగదీష్‌చారి, సంతోశ్, హరీశ్, ఫయాజ్, కార్తీక్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.




ఆందోళన చేస్తున్న తీన్మార్ మల్లన్న టీం సభ్యులు

సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చేరికలు

ఎమ్మెల్యే కాలె యాదయ్య

షాబాద్: రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు, నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని హైతాబాద్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు 40 మంది ఆ పార్టీకి రాజీనామా చేసి వారి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే, నాయకులు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేవెళ్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాను క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేలా సమష్టిగా ముందుకు సాగాలని సూచించారు. పార్టీని మరింత బలోపేతం చేసేలా ఐక్యంగా పని చేయాలన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చేందుకు కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు. ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో చేవెళ్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సంజీవరెడ్డి, నాయకులు జనార్దన్‌రెడ్డి, ఖాజామీయా, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీరాములు, సుభాష్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యులు కుమ్మరి చెన్నయ్య, అశోక్ తదితరులు ఉన్నారు.



పార్టీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలి

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన దోర్నాల్ గ్రామస్తులు

ధారూరు: మండల పరిధిలోని దోర్నాల్ పంచాయతీ కార్యాలయం పక్కనున్న ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని సోమవారం గ్రామస్తులు కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో అర్జీ ఇచ్చారు. గ్రామానికి చెందిన కమ్మరి మోహన్ అక్రమంగా ఇటి నిర్మాణం చేపట్టాడని గ్రామ కార్యదర్శికి ఫిర్యాదు చేసిన రాజకీయ ఒత్తిడితో ఏం చేయలేకపోతున్నారని పేర్కొన్నారు. ఏప్రిల్ 25న ఎంపీడీఓ, ఎంపీఓ, జీపీ కార్యదర్శికి ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన చొరవ తీసుకుని వెంటనే ఇంటి నిర్మాణాన్ని నిలిపివేసి కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

నేడు సింహ గర్జన సన్నాహక సమావేశం

కుల్కచర్ల: ఆసరా, దివ్యాంగుల పెన్షన్లపై ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఆగస్టు 13న నగరంలో దివ్యాంగుల సింహ గర్జనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు వెంకట్రాములు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మంగళవారం వికారాబాద్‌లో నిర్వహించనున్న సన్నాహక సమావేశానికి ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

తీన్మార్ మల్లన్నపై దాడి అప్రజాస్వామికం

బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్

తాండూరు టౌన్: క్యూన్యూస్ కార్యాలయం, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై దాడి అప్రజాస్వామికమని బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ కవితపై తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలకు శాంతియుతంగా నిరసన తెలపడం లేదా చట్టపరంగా ఆయన్ను ఎదుర్కోవాలన్నారు. మీడియాపై, జర్నలిస్టు మల్లన్నపై దాడి సబబు కాదన్నారు. బడుగు బలహీన వర్గాల గొంతుకగా మల్లన్న తన క్యూన్యూస్ ద్వారా అక్రమాలను ప్రశ్నిస్తున్నారన్నారు. పజాస్వామ్య దేశంలో దాడులు సమంజసం కాదని, వెంటనే దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

'ప్రజావాణి'ని వినియోగించుకోవాలి

కోట్‌పల్లి ఎంపీడీఓ డానియల్



ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు

బంట్వారం: మండల పరిషత్ కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోట్‌పల్లి ఎంపీడీఓ డానియల్ అన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ చంద్రప్ప, ఆర్ఐ భాగ్యలక్ష్మి, ఈజీఎస్ ఏపీఓ ఎలీషా, వెటర్నరీ అధికారి జగన్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం

బీజేపీ మండల అధ్యక్షుడు శివకుమార్

బంట్వారం: స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదామని బీజేపీ కోట్‌పల్లి మండల అధ్యక్షుడు శివకుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలన్నారు. గ్రామాల్లో వేస్తున్న సీసీ రోడ్లన్నీ కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులతోనే అనే విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. బూత్ స్థాయి నుంచి పార్టీని మరింతగా బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక ఎన్నికలు ఎప్పుడు జరిగినా మెజార్టీ స్థానాలను గెలుచుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక సంస్థల ఎన్నికల జెడ్పీటీసీ ఇన్‌చార్జిగా కృష్ణాయాదవ్, ఎంపీటీసీల ఇన్‌చార్జిగా రావిరాల రవిని నియమించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఓగులాపూర్ రాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శివకుమార్

ఘనంగా పోచమ్మ బోనాలు

పరిగి: పట్టణంలో సోమవారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. పట్టణ వాసులు ఉదయం నుంచే అమ్మవారి ఆలయానికి పోటెత్తారు. డప్పు చప్పుళ్లు, శివసత్తుల శిగాలు, పోతురాజుల ఆటల నడుమ మహిళలు బోనాల ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ ఉత్సవాల్లో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఘటం ఊరేగింపునకు హాజరైన మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తదితరులు

రోడ్డు పనుల పరిశీలన

అనంతగిరి: వికారాబాద్‌లోని అనంతగిరిపల్లి నుంచి మొత్కుపల్లి వరకు సెంట్రల్ రోడ్ ఫండ్స్ కింద మంజూరయ్యాయి. ఈ పనులను సోమవారం బీజేపీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా దిశ కమిటీ సభ్యుడు వడ్ల నందు మాట్లాడుతూ.. పనులను సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శివరాజు, సెంట్రల్ ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యులు బస్వలింగం, దళిత మోర్చా జిల్లా నాయకులు మల్లేశం, శ్రీనివాస్ రెడ్డి, రాజు, శ్రీనివాస్‌చారి, పాండురంగారెడ్డి, సత్తిరెడ్డి, రాఘవేందర్ తదితరులు ఉన్నారు.

బస్సుల కోసం రోడ్డెక్కిన విద్యార్థులు



రోడ్డుపై ధర్నా చేస్తున్న విద్యార్థులు

కమ్మెట చౌరస్తాలో రోడ్డుపై బైఠాయింపు

చేవెళ్ల: విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఆర్టీసీ బస్సు సర్వీసులను పెంచాలని కోరుతూ విద్యార్థులు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. మండలంలోని కమ్మెట-ఎన్కేపల్లి చౌరస్తాలో సోమవారం ఉదయం పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు బస్సులు సమయానికి రావటం లేదని, తగిన సంఖ్యలో సర్వీసులు లేవని రోడ్డుపై ధర్నాకు దిగారు. మండలంలోని కమ్మెట, ఎన్కేపల్లి, గొల్లగూడ, ఈర్లపల్లి తదితర గ్రామాలకు చెందిన విద్యార్థులు కమ్మెట-ఎన్కేపల్లి చౌరస్తా నుంచి అటూ శంకర్‌పల్లి, చేవెళ్ల, హైదరాబాద్‌లకు నిత్యం వెళ్తుంటారన్నారు. ఉదయం, సాయంత్రం సమయంలో తమకు సరిపడా బస్సులు రావటం లేదని, దీంతో నిత్యం ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు తెలిపారు. బస్సుల సంఖ్యను పెంచాలని కోరుతూ ఆందోళన చేపట్టారు. ఉదయం సమయంలో విద్యార్థులు సమయానికి రాకపోవటంతో కళాశాలలు, పాఠశాలలకు వెళ్లలేకపోతున్నామని వాపోయారు. ఈ ధర్నాతో ట్రాఫిక్ జామ్‌తో వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని విద్యార్థులతో మాట్లాడి, డిపో అధికారులతో మాట్లాడిస్తామని నచ్చజెప్పి ఆందోళనను విరమింపజేశారు.

ఉత్తమ సేవలకు అవార్డులు

అనంతగిరి: వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందించిన వారికి నగరంలోని గాంధీ భవన్ ప్రకాశం హాల్‌లో ఆదివారం అవార్డులు అందజేశారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ,గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో వికారాబాద్‌కు చెందిన శ్రీ వివేక వాణి విద్యాలయం కరస్పాండెంట్ ఎం.నాగయ్య స్వరూప దంపతులతో పాటు గీతాంజలి స్కూల్ కరస్పాండెంట్ చేవెళ్ల చంద్రశేఖర్ ఉష దంపతులకు అవార్డులు అందజేశారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమల వంటి రంగాల్లో సేవ చేసిన వారికి ఈ అవార్డు ఇవ్వడం జరిగింది. తెలంగాణ ఉద్యమ నాయకుడు, సామాజిక వేత్త, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.



అవార్డు అందుకుంటున్న నాగయ్య స్వరూప దంపతులు